సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శుక్రవారం ၊ 26 ၊ మే ၊ 2023



పరిమళించిన మానవత్వం

మానవత్వం పరిమళించింది. ఓ వ్యక్తి మృతదేహానికి న్యూ విజయనగరం యూత్ సభ్యులు గురువారం అంత్యక్రియలు పూర్తిచేశారు. -8లో..



మైదుకూరులో ఆస్పత్రి సీజ్

వైద్యం చేసేందుకు సరైన అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఓ ఆస్పత్రిని మైదుకూరులో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాస్ రెడ్డి సీజ్ చేశారు. -8లో..



క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

సింహాద్రిపురంలోని గురిజాల సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రోషన్ తెలిపారు. -8లో..

నిర్మాణం.. శరవేగం

భూగర్భ జలాల పెంపు, 12,500 ఎకరాలకు ఆయకట్టుకు నీరందించే లక్ష్యంగా లోయర్ సగిలేరు ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టుకు ఐదు కొత్త గేట్లు ఏర్పాటు చేస్తున్నారు.దీనికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి.

- జోరుగా సగిలేరు ప్రాజెక్టు అభివృద్ధి పనులు
- కొత్తగా ఐదు గేట్ల నిర్మాణం
- పనుల పూర్తితో చివరి ఆయకట్టు వరకు సాగునీరు



అమర్చేందుకు సిద్ధంగా ఉన్న గేట్లు



200 క్యూసెక్కుల నుంచి 500 క్యూసెక్కుల నీరు పారేందుకు వెడల్పు చేస్తున్న కాలువ

కడప సిటీ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో లోయర్, సగిలేరు (మధ్య తరహా) ప్రాజెక్టు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 1954 నుంచి 1959 మధ్యలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ప్రస్తుతం దీని గేట్లు దెబ్బతినడంతో కొత్తగా ఐదు నిర్మించడానికి రూ. 4 కోట్లు మంజూరు చేశారు. అంతేకాకుండా కెనాల్ సామర్థ్యాన్ని 200 నుంచి 500 క్యూసెక్కులకు పెంచేందుకు మరో రూ. 80 కోట్లు కూడా కేటాయించారు. ప్రస్తుతం మూడు గేట్ల నిర్మాణం పూర్తి కాగా మరో రెండింటిని గుజరాత్ నుంచి ప్రత్యేక ల్యాబ్‌కు చెందిన నిపుణులు పరిశీలించిన తర్వాత అమర్చనున్నారు. కెనాల్ సామర్థ్యం మేరకు నీటి ప్రవాహం వచ్చేలా కాలువ పనులు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం సిమెంటు లైనింగ్ పనులు జరుగుతున్నాయి. నిబంధనల మేరకు పనులు జరుగుతున్నా ఎల్లో మీడియా ఇవేమి గమనించకుండా దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఐదు కొత్త గేట్ల నిర్మాణం

బి.కోడూరు మండలం వంకమర్రి ప్రాంతం వద్ద లోయర్ సగిలేరు ప్రాజెక్టు ఉంది. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 169 ఎంసీఎఫ్‌టీ (ఘనపుటడుగులు).



భూగర్భజలాలు పెంపొందడమే కాకుండా 12,500 ఎకరాలకు ఆయకట్టుకు నీరందించే లక్ష్యంగా 1954 నుంచి 1959 సంవత్సర కాలంలో ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. గేట్లు దెబ్బతిన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రూ. 4 కోట్లతో ఐదు కొత్తగేట్ల నిర్మాణం, కెనాల్ సామర్థ్యాన్ని రూ. 80 కోట్లతో 200 నుంచి 500 క్యూసెక్కులకు పెంచేందుకు పనులు చేపట్టారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారం

ప్రాజెక్టు పనులు నిబంధనల మేరకు అంచెలంచెలుగా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం లోయర్ సగిలేరు ప్రాజెక్టుకు మూడు కొత్త గేట్లు అమర్చారు. మరో రెండు అమర్చాల్సి ఉంది. సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం గుజరాత్ నుంచి ఓ ప్రత్యేక ల్యాబ్‌కు చెందిన నిపుణులు వీటిని పరిశీలించిన తర్వాతనే అమర్చాల్సి ఉంది. అంతేకాకుండా కెనాల్ సామర్థ్యాన్ని 200–500 క్యూసెక్కులకు పెంచేందుకు 23 కిలోమీటర్ల మేర పనులు కూడా జరిగాయి. అయితే కాలువ పనులు జరిగిన తర్వాత ఒకసారి ట్రయల్ రన్ చేసేందుకు నీటిని వదులుతారు. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయన్న విషయాన్ని గమనించి వాటిని సరిచేసి ఆ తర్వాత సిమెంటు లైనింగ్ పనులను చేపడతారు. ప్రస్తుతం లైనింగ్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ఎల్లో మీడియా గ్రహించకుండా, అధికారుల నుంచి సమాచారం తీసుకోకుండా 'చేతులెత్తేశారని' ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

1200 ఎకరాల ఆయకట్టు

లోయర్ సగిలేరు ప్రాజెక్టుకు తెలుగుగంగ, సగిలేరు నుంచి వరద నీరు చేరుతుంది. దీని ద్వారా బి.కోడూరు, బద్వేలు, బి.మఠం మండలాల్లోని 30 చెరువులకు నీరు నింపి కాలువల ద్వారా సాగునీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టుకు 12,500 ఎకరాలు ఆయకట్టు ఉంది. పూర్తి ఆయకట్టుకు నీటిని ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

గడువులోగా పనులు పూర్తి



నాణ్యతా ప్రమాణాలతో సగిలేరు ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. అగ్రిమెంటు గడువులోపు గేట్లు, కాలువ నిర్మాణానికి సంబంధించిన లైనింగ్ పనులు పూర్తి చేస్తాం. జూన్ చివరి నాటికి గేట్ల అమరిక పూర్తవుతుంది. కాలువ లైనింగ్ పనులు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ఈ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. –వెంకట్రామయ్య, ఈఈ, నీటిపారుదలశాఖ, కడప

న్యూస్‌రీల్

నేడు డీఈఓ కార్యాలయానికి రావాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్పెషల్ బీఈడీతో దృష్టి లోపం ఉన్నవారికి బోధించే అర్హత కలిగిన ఉన్న గణిత, భౌతికశాస్త్ర పాఠశాల సహాయకులు తప్పనిసరిగా ఈ నెల 26వ తేదీన డీఈఓ కార్యాలయానికి హాజరు కావాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు తమ సర్వీస్ రిజిస్టర్, సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 10 గంటలకు రావాలని, వాటిని వెరిఫికేషన్ చేయించుకోవాలని డీఈఓ సూచించారు.

పారదర్శకంగా బదిలీలు

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరస్పర (మ్యూచువల్) బదిలీలను చేపడుతున్నట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఒకే కేడర్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగుల అంగీకారంతో పరస్పర బదిలీలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మ్యూచువల్ బదిలీలు ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఏ రోజు వచ్చిన దరఖాస్తులను పరిశీలన అనంతరం నిబంధనల మేరకు ఆ రోజే ఆర్డర్స్ ఇస్తున్నట్లు తెలిపారు.

27న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప కలెక్టరేట్‌లోగల తమ కార్యాలయంలో ఈనెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. వినూత్న కంపెనీలో ఉద్యోగ ఖాళీల భర్తీలో భాగంగా నియామక ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ చదివి 19–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. విద్యార్హతల ధృవపత్రాలు, ఫొటోలు తీసుకుని శనివారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు పురుష అభ్యర్థులు హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా గురువారం 62 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు 10658 మంది విద్యార్థులకుగాను 10048 మంది హాజరయ్యారు. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 9045 మందికిగాను 8573 మంది, ద్వితీయ సంవత్సరానికి 1613 మందికిగాను 1475 మంది హాజరయ్యారు. ఆర్‌ఐఓ రమణరాజు రాయచోటి ప్రాంతంలో పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.ఫ్లయింగ్ ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలకు విద్యార్థులు లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు ఆర్‌ఐఓ రమణరాజు తెలిపారు.

'మెడికల్ అండ్ హెల్త్' డీడీగా భక్తవత్సలం

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా భక్తవత్సలం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయంలో డీడీగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. గతంలో కడప రిమ్స్ మెడికల్ కాలేజీ డీడీగా విధులు చేపట్టారు. కర్నూలు ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి ఏడీగా పనిచేస్తున్న రమేష్‌బాబు ఇన్నాళ్లు ఇక్కడ ఇన్‌ఛార్జి డీడీగా విధులు నిర్వహించారు

ఐసీడీఎస్‌లో బదిలీలకు కౌన్సెలింగ్

కడప కోటిరెడ్డి సర్కిల్: స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థలో బదిలీలకు ఈనెల 26వ తేదీ కర్నూల్‌లో కౌన్సెలింగ్ జరగనుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనిచేస్తున్న స్థానంలో ఐదేళ్లు పూర్తయిన వారు తప్పక బదిలీ కావాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా నుంచి ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, 16 మంది సూపర్‌వైజర్లు బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరుకానున్నారు.

కారుణ్య నియామకాల అభ్యర్థుల జాబితా విడుదల

కడప కోటిరెడ్డి సర్కిల్: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కడప జోన్ పరిధిలో(కడప, అనంతపురం, కర్నూలు) కారుణ్య నియామకాల కింద ఎంపికైన అభ్యర్థుల వివరాలను డీపీటీఓ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో ఉంచినట్లు కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం రీజియన్‌లో 51 మందికిగాను ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, 17 మంది కానిస్టేబుళ్లు, 32 మంది అసిస్టెంట్ గ్రామిక్‌లను భర్తీ చేస్తున్నామన్నారు. కడప రీజియన్ పరిధిలో 29 మందికిగాను ఒక జూనియర్ అసిస్టెంట్, 14 కానిస్టేబుళ్లు, 14 అసిస్టెంట్ గ్రామిక్‌లను, కర్నూల్ రీజియన్‌లో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, 21 మంది కానిస్టేబుళ్లు, ఒక డ్రైవర్, 19 మంది అసిస్టెంట్ గ్రామిక్‌లను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులు మెడికల్ టెస్టుల తర్వాత కాల్ లెటర్లు పంపిస్తామన్నారు.

నేడు గ్రేడ్–2 హెచ్‌ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లలో ఖాళీగా ఉన్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతుల కౌన్సెలింగ్ జరుగుతుందని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైనల్ సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. సీనియారిటీ జాబితాలో ఉన్న వారంతా కడప కోటిరెడ్డిసర్కిల్ సమీపంలోని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల(ఆర్‌జేడీ ఆఫీసు) కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సర్వీసు రిజిస్టర్‌తో హాజరుకావాలని ఆర్‌జేడీ సూచించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



రాజంపేటలో సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ రమణ

రాజంపేట: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామని వైఎస్సార్ ఉమ్మడి జిల్లాల ఏపీఎస్పీడీసీఎల్ సూపరిండెంట్ ఇంజినీరు రమణ అన్నారు. శుక్రవారం రాజంపేట డివిజన్ కార్యాలయాన్ని తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన కనెక్షన్లు వెంటనే ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. డబ్బులు చెల్లించిన నెల రోజుల్లో కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ బకాయిలను సకాలంలో రాబట్టాలన్నారు. వినియోగదారులకు మెరుగైన రీతిలో సేవలందించాలన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం..

డీఈ కార్యాలయంలో రాజంపేట డివిజన్ అధికారులతో ఎస్‌ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖపరమైన అంశాలపై పలుసూచనలు ఇచ్చారు. డీఈఈ సురేంద్రనాథ్, భాస్కర్, మురళీధర్‌లు డివిజన్ ఏఈలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమపథకాలు అందించాలి

కలెక్టర్ విజయరామరాజు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ట్రైనీ కలెక్టర్‌లు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సంతృప్త స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ తప్పక అందించాలని చెప్పారు. గురువారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి జగనన్నకు చెబుదాం, పాఠశాల విద్య, సచివాలయాలు తదితర అంశాలపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో రీ సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని చెప్పారు. ఎక్కడా పెండింగ్ లేకుండా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ, భూ రికార్డుల స్వచ్ఛీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న భూసేకరణ, పరిహారం ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. తాగునీటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పశు వైద్య కేంద్రాల్లో వసతులు మెరుగుపరచాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట(సిద్ధవటం): ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి నెలసరి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు.ఆలయ రంగమండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.హుండీ ఆదాయం రూ.9 లక్షల, 2 వేలు వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

25 శాతం సీట్లు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి 2023–24 విద్యా సంవత్సరానికి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు. గురువారం కడపలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందన్నారు.ఈ విషయాన్ని ప్రతి పాఠశాల యాజమాన్యం గుర్తుంచుకోవాలన్నారు.ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు ఫేజుల్లో అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించామన్నారు. మొదటి విడతలో 339 మందికి, రెండో విడతలో 396 మందికి అడ్మిషన్లు కల్పించారన్నారు కార్యక్రమంలో ఏడీ మునీర్‌ఖాన్, సూపరిండెండెంట్ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

ఎంఎంటీఎస్ ద్వారా 189 మొబైల్‌ఫోన్‌ల రికవరీ



బాధితురాలికి మొబైల్‌ఫోన్‌ను అందజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లా పోలీసుశాఖ రూపొందించిన 'మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం' (ఎంఎంటీఎస్) విధానం (వాట్సాప్ నంబర్ 93929 41541) ద్వారా రికవరీ చేసిన రూ. 45 లక్షల విలువైన 189 మొబైల్ ఫోన్‌లను కడపలోని 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ గురువారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్.ఐ.ఆర్ నమోదు లేకుండా వారికి రికవరీ చేసివ్వాలనే సంకల్పంతో గత ఏడాది డిసెంబర్ 1న ఎంఎంటీఎస్ పేరిట ఉచితంగా వెబ్‌సైట్ సేవలను ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో మరింత సులువైన సేవలు అందించడానికి 'చాట్ బాక్స్'ద్వారా 93929 41541 సేవలను ప్రారంభించామన్నారు. అతి తక్కువ సమయంలో దశలవారీగా రూ.1.75 కోట్ల విలువైన 669 మొబైల్‌ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు 5000 మొబైల్స్ మిస్సింగ్ ఫిర్యాదులు వచ్చాయని, అన్ని మొబైల్స్‌ను కూడా రికవరీ చేసి బాధితులకు అందిస్తామని ఎస్పీ తెలిపారు. ఎలాంటి సైబర్ నేరం జరిగినా, సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. తద్వారా ఫోన్‌కు లింక్ అయి వున్న బ్యాంక్ అకౌంట్‌ను ముందు జాగ్రత్తగా తమకు వచ్చే మెయిల్ ఆధారంగా ఫ్రీజ్ చేస్తామన్నారు. సరైన బిల్లులు లేకుండా ఎవరూ మొబైల్ ఫోన్‌లు కొనవద్దన్నారు. గురువారం సెల్‌ఫోన్‌లు అందుకున్నవారు జిల్లా ఎస్పీకి బాధితులు 'థ్యాంక్యూ ... ఎస్పీ సార్' అంటూ ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ పర్యవేక్షణలో మొబైల్ ఫోన్‌ల రికవరీలో శ్రమించిన సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం ఇన్స్‌పెక్టర్ వి.శ్రీధర్ నాయుడు, ఎస్‌ఐలు మధుమల్లేశ్వర్ రెడ్డి, రవికుమార్, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆధిపత్య పోరాటం!

- ప్రొద్దుటూరు టికెట్ కోసం వ్యూహాత్మక ఎత్తుగడలు
- నారా లోకేష్ ఎదుట ఒకరిపై మరొకరు ఫిర్యాదులు, దాడి
- మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, ఇన్‌చార్జి ప్రవీణ్ పరస్పర ఆరోపణలు
- అన్నదానం పేరిట తెరపైకి వస్తున్న పోట్లదుర్తి సురేష్



లింగారెడ్డి



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ టికెట్ కోసం ప్రొద్దుటూరు నేతలు ఆరాటపడుతున్నారు. ఎవరికి వారు తనదే టికెట్ అంటే తనదేనని అనుచరుల వద్ద బీరాలు పలుకుతున్నారు. పార్టీలో ఆధిపత్యం సాధించాలనే తపన ఎవరికి వారిలో అధికంగా కన్పిస్తోంది. కార్యక్రమం ఏదైనా ఇద్దరు నేతలు పరస్పరం ఎదురైతే ఆరోపణలు అందుకుంటున్నారు. తాజాగా నారా లోకేష్ యువగళం కార్యక్రమం వేదికగా నిలిచింది. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలను శాంతింపజేయాల్సిన పరిస్థితి నారా లోకేష్‌కు ఎదురైంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు టీడీపీ నేతల మధ్య అంతర్యుద్ధం నడుస్తోంది. అవకాశమొస్తే అదృష్టం పరీక్షించుకోవాలని ఎవరికి వారు ఆరాటం ప్రదర్శిస్తున్నారు. ప్రధానంగా ప్రొద్దుటూరు నాదే అన్న ధోరణి మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డిలో అధికంగా కన్పిస్తోంది. టీడీపీ జోన్–5 ప్రాంతీయ సదస్సులో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరు కావడాన్ని లింగారెడ్డి జీర్ణించుకోలేకపోయారు. జోన్–5 వేదికపైనే వాగ్వివాదానికి దిగారు. అప్పటి వ్యవహారం అటుంచితే, గురువారం ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డిని టార్గెట్ చేసి నారా లోకేష్ ఎదుట వ్యక్తిగత ఆరోపణలకు దిగారు. ఒకరిపై మరొకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకుంటుండడంతో లోకేష్ సర్దిచెప్పాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇద్దరిని నడిరోడ్డుపై కాకుండా తనతో పాటు తీసుకెళ్లి మంతనాలు నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో విరుచుకుపడినట్లు విశ్వసనీయ సమాచారం. వీరి వైఖరి చూస్తే ప్రొద్దుటూరు తమకు మాత్రమే పరిమితం అన్నట్లుగా కన్పిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేతలు చెప్పుకొస్తున్నారు.

తెరపైకి వస్తున్న పోట్లదుర్తి సురేష్....


ప్రొద్దుటూరు రాజకీయాలు పట్ల ఎవరికి వారు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లెల లింగారెడ్డి, గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ టికెట్ ఆశిస్తుండగా తెరవెనుక పోట్లదుర్తి సురేష్ అదేబాట పట్టారు. అందుకోసం ముందుగా అన్నదానం ఏర్పాటు చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఈకార్యక్రమాన్ని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేతుల మీదుగా అట్టహాసంగా చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పోట్లదుర్తి సురేష్ వ్యవహారాన్ని పసిగట్టిన ఇతర నేతలు లోకేష్ ద్వారా చేపట్టకుండా అడ్డుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. నారా లోకేష్ పర్యటనకు మోకాలొడ్డితే రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలనే దిశగా ఆలోచిస్తున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఇలా ఎవరికి వారు టీడీపీ టికెట్ కోసం ఎత్తుగడలు వేస్తున్నారని పలువురు వివరిస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

మైదుకూరు : మైదుకూరు – ప్రొద్దుటూరు రహదారిలో బైపాస్ బ్రిడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లెకు చెందిన హరినాథ్ రెడ్డి, వీరారెడ్డి, అమరనాథ్‌రెడ్డి అనే వారు బైక్‌లో ప్రొద్దుటూరు వైపు వెళుతుండగా వెనుక వైపు నుంచి లారీ ఢీ కొంది. ఈ సంఘటనలో ముగ్గురు యువకులకు రక్తగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కడపలోని రిమ్స్‌కు తరలించారు. హరినాథ్ రెడ్డిని మెరుగైన చికిత్సకు నెల్లూరుకు తరలించినట్లు తెలిసింది.

టీడీపీ హయాంలో
మోరీ అయినా నిర్మించారా

- ఏమి చేశారని పాదయాత్రకు వస్తున్నావు
- లోకేష్‌కు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూటిప్రశ్న



ప్రొద్దుటూరు : ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ హయాంలో గుర్తుపెట్టుకోవడానికి కనీసం ఒక్క అభివృద్ధి పని అయినా చేశారా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జమ్మలమడుగు నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోందని, నాలుగు రోజుల విశ్రాంతి అనంతరం ఈనెల 30న ప్రొద్దుటూరుకు చేరుకోనున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారన్నారు. లోకేష్ చేపట్టిన పాదయాత్ర శాసనసభ్యునిగా తనకు అభ్యంతరకరమేనని, అయితే ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వ్యక్తిగా అడ్డుకోనన్నారు. టీడీపీకి ఓటు వేయండని పాదయాత్రగా వస్తున్న లోకేష్‌కు ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. 2014–19 వరకు ఈ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. మౌలిక వసతులు ఏర్పాటు చేశారా, బ్రిడ్జిని నిర్మించారా, ఒకరికైనా ఇళ్లు నిర్మించారా, కొత్త తాగునీటి పథకం వేయించారా, కనీసం బోరింగ్ వేయించారా, మోరీ అయినా కట్టారా అని అన్నారు. శ్మశానానికి స్థలం కూడా ఆ ప్రభుత్వంలో మంజూరు చేయలేదన్నారు. ప్రజల వైపు నుంచి లోకేష్‌ను ప్రశ్నించే హక్కు తనకు ఉందన్నారు. శివాలయం సెంటర్‌లో ఎన్నికల ప్రచార సభ నిర్వహించి డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మహిళలను, వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని రైతులను మోసం చేశారన్నారు. మగ్గం నేసేందుకు నేతన్నలకు ఉచిత కరెంట్ ఇస్తామని ఎగనామం పెట్టారన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజలను గాలికొదిలేశారని మండిపడ్డారు.

వ్యక్తిగత విమర్శలే లక్ష్యం

గత ఎన్నికల సందర్భంగా చెప్పిన అన్ని వాగ్దానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. చెప్పిన మేరకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్లు ఇస్తున్నారని, డ్వాక్రా రుణాలను మాఫీ చేశారని, నేతన్నలను బతికించేందుకు వైఎస్సార్ నేతన్న పథకాన్ని అమలు చేశారన్నారు. మీ తండ్రి చేసిన గొప్ప పనులేంటో చెప్పి ప్రజల్లోకి వస్తే బాగుంటుందని లోకేష్‌కు హితవు పలికారు. వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం చేతకాక, అటు జగన్‌ను ఇటు స్థానిక ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి విమర్శలు చేస్తున్నారన్నారు. జగన్ అమలు చేస్తున్న పథకాలు మంచివా.. చెడ్డవా, చెడ్డవి అయితే రద్దు చేస్తానని ప్రకటిస్తావా, లేక కొనసాగిస్తావా చెప్పాలని కోరారు. టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలను నెరవేర్చారా, చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని అన్నారు. ఉన్నవి లేనివి నాలుగు మాటలు చెప్పి వెళ్లడం సరికాదన్నారు. టీడీపీ చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని తాను స్వయంగా సీబీఐ కార్యాలయానికి వెళ్లి లేఖ ఇచ్చానని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

పరిమళించిన మానవత్వం

- తండ్రి మృతివార్త తెలియజేసినా పట్టించుకోని కుటుంబీకులు
- మృతుడు వైఎస్సార్ జిల్లావాసి
- దహనసంస్కారాలకు ముందుకొచ్చిన విజయనగరం యూత్‌సభ్యులు



గోపాల్ మృతదేహానికి అంత్య క్రియలు చేస్తున్న న్యూ విజయనగరం యూత్ సభ్యులు



మృతునికి సంబంధించిన ఆధార్ కార్డు

విజయనగరం ఫోర్ట్ : మానవత్వం పరిమళించింది. ఓ వ్యక్తి మృతదేహానికి న్యూ విజయనగరం యూత్ సభ్యులు గురువారం అంత్యక్రియలు పూర్తిచేశారు. వివరాల్లోకి వెళ్తే... వైఎస్సార్ జిల్లా మంగపట్నం కమ్మవారిపల్లెకు చెందిన గోపాల్‌నాయుడు అనే వ్యక్తి ఇటుక బట్టీల్లో మట్టిపనులు చేసేందుకు భార్య వెంకటలక్ష్మితో కలిసి ఏడాది కిందట పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు వచ్చాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో వైద్యసేవల కోసం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అంత్యక్రియలు చేయడానికి డబ్బులు లేక గోపాల్‌నాయుడు భార్య బాధపడుతున్న విషయం తెలుసుకున్న న్యూ విజయనగరం యూత్ సభ్యులు శివ, అనిల్‌కుమార్‌లు రింగ్ రోడ్డులో ఉన్న వైకుంఠ ద్వారంలో మృతుడికి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆ సమయంలో మృతుడి భార్య కన్నీటిపర్యంతమైంది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. అయితే, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, అల్లుళ్లు ఉద్యోగులని సమాచారం. తండ్రి మృతిచెందాడన్న విషయాన్ని అంబులెన్స్ డ్రైవర్ తెలియజేసినా పట్టించుకోలేదని, అక్కడే దహన సంస్కారాలు పూర్తిచేయాలని, డెత్ సర్టిఫికెట్ పంపిస్తే చాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు తెలిసింది.

వైఎస్‌ఆర్‌సీపీలో 50 కుటుంబాలు చేరిక



టీడీపీ నాయకులను వైఎస్‌ఆర్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని మామిళ్లపల్లి, పెద్దముసల్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన 50 కుటుంబాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. 16, 17వ డివిజన్‌ల కార్పొరేటర్‌లు నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు ఓబుల్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిల సమక్షంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్‌ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్‌ఆర్‌సీపీలోకి చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో నరసింహులు, చిన్ననరసింహులు, శివకుమార్, వెంకటరమణ, రాజారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కృష్ణయ్య, హరికృష్ణ, మోహన్, బాలకృష్ణ, శివశంకర్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మైదుకూరులో ఆస్పత్రి సీజ్

మైదుకూరు : వైద్యం చేసేందుకు సరైన అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఓ ఆస్పత్రిని గురువారం మైదుకూరులో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాస్ రెడ్డి సీజ్ చేశారు. పట్టణంలోని సర్వాయపల్లె రోడ్డులో ఓ వ్యక్తి సరైన అర్హత లేకుండా నడుపుతున్న మన ప్రాథమిక వైద్య క్లినిక్ అనే ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అర్హత లేకున్నా వైద్యం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంట వనిపెంట వైద్యాధికారి మల్లేష్, డిప్యూటీ డెమో అధికారి రమణమ్మ పాల్గొన్నారు.



ఆస్పత్రిని సీజ్ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రహాస్‌రెడ్డి

పేదలపాలిట పెన్నిధి

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదల పాలిట పెన్నిధి వంటిదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రహాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తువ్వపల్లె సచివాలయ పరిధిలోని జాండ్లవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. జీవీ సత్రం వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి, సూపర్‌వైజర్ జనార్దన్, సీహెచ్‌ఓ ప్రియదర్శిని, ఏఎన్‌ఎం ఉమ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని గురిజాల సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం రాత్రి క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రోషన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి ఐదురుగు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను పట్టుకుని రెండు మొబైల్ ఫోన్లతోపాటు రూ.21,100 డబ్బులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు ఏవైనా జరుగుతుంటే సమాచారం ఇచ్చే వారికి నగదు బహుమతి ఇవ్వడంతోపాటు వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను చూపుతున్న ఎస్‌ఐ

కాలువలో పడి వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : పెద్దపసుపల రహదారిలో ఉన్న ఉత్తరకాలువలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన జమ్మలమడుగులో చోటు చేసుకొంది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన షిండే శివాజి (55) మరో కొంత మంది సాయిబాబా భక్తులు ఆటో వేసుకుని ఈనెల 23వ తేదీ పట్టణంలో భిక్షాటన చేసుకున్నారు. కాగా రాత్రి కావడంతో కాలువ సమీపంలోని ఖాళీ స్థలంలో నిద్రపోయారు. అయితే షిండే శివాజి రాత్రి మల మూత్ర విసర్జన కోసం వెళ్లి ఉత్తర కాలువలో పడి మృతిచెందాడు. గురువారం ఉత్తరకాలువలో శివాజీ మృతదేహం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



ఓం ప్రకాష్ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పెద్దపసుపల రహదారిలో ఉన్న రైస్ మిల్లులో బుధవారం రాత్రి ఓం ప్రకాష్ (24) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ మురళీ యాదవ్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓం ప్రకాష్ రైస్ మిల్లులో హమాలి పనులు చేసేవాడు. కాగా రాత్రి భోజనం చేసిన తరువాత ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. వీఆర్వో రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి..



రవి మృతదేహం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని వినాయకనగర్ కాలనీకి చెందిన కుమ్మతి రవి అనే వ్యక్తి భార్యతో గొడవ పడి బుధవారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారని రైల్వే ఎస్‌ఐ కేఎస్ వర్మ తెలియజేశారు. గురువారం ఉదయం సంఘటన స్థలానికి రైల్వే పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారన్నారు. మృతుడికి మొదటి భార్య మృతి చెందిందని, రెండవ భార్య మేరీ ఉందన్నారు. మృతుడికి ఇద్దరు సంతానం కలరు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు

దువ్వూరు : మండలంలోని ఇడమడక గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి దేవర సందర్భంగా గురువారం న్యూ కేటగిరి వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.75వేలు నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు, రెండో బహుమతి రూ.50వేలు కర్నాటక రాష్ట్రానికి చెందిన రాయచూర్ జిల్లాకు చెందిన పాలకందొడ్డి ఖాజాహుసేన్ ఎద్దులు గెలుపొందాయి. మూడో బహుమతి రూ.30వేలు కడప జిల్లా మైదుకూరు మండలానికి చెందిన కుర్రా వెంకటయాదవ్ ఎద్దులు, నాలుగో బహుమతి రూ.20వేలు నంద్యాల జిల్లా చిన్నకానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు, ఐదో బహుమతి రూ.10వేలు బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోటి శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎద్దులు గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు నగదు అందించారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు మడూరు రోడ్డులో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో సీఐ ఇబ్రహీం తన సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దాడిలో దువ్వూరుకు చెందిన వెంకట నరసింహగౌడ్, సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన హరినారాయణలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 60 వేలు నగదుతో పాటు బెట్టింగ్ స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గువ్వల చెరువు ఘాట్‌లో రెండు లారీలు బోల్తా

చింతకొమ్మదిన్నె : కడప– రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో గురువారం రెండు లారీలు అదుపుతప్పి బోల్తా పడ్డాయి. సీకే దిన్నె ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు .. రాయచోటి నుంచి కడప వైపునకు టమోటా లోడుతో వస్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ అవడంతో డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడిందన్నారు. వెనకాలే పచ్చి టెంకాయల లోడుతో వస్తున్న మరో లారీ బోల్తా పడ్డ లారీని తప్పించబోయి అదుపుతప్పిందన్నారు. ఈ ప్రమాదంలో రెండు లారీల్లో ఉన్న డ్రైవర్లు, క్లీనర్లు సురక్షితంగా బయట పడ్డారన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.